

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

న కిసీ కీ ఆంఖ్ క నూర్ హూ

న కిసీ కె దిల్ క కరార్ హూ

జో కిసీ కె కామ్ న ఆ సకే

మై వో ఏక్ మూష్త్ – ఎ – గుబార్ హూ...

'లాల్‌ఖిలా' సినిమాలో ఎస్.ఎన్. త్రిపాఠీ వీలయినన్ని అతి తక్కువ వాయిద్యాలతో, స్వరం తప్ప మరో ధ్వని లేకుండా రూపొందించిన గజల్ ఇది. వాయిద్యాలు అతి తక్కువగా మ్రోగటంతో గాయకుడు మహమ్మద్ రఫీ స్వరం పలికే భావాలు, చేసే విన్యాసాల ప్రాధాన్యం హెచ్చింది. దాంతో మహమ్మద్ రఫీ స్వర ప్రతిభను అత్యద్భుతంగా ప్రదర్శించే మరుపురాని విషాదగీతాలలో ఉచ్చస్థాయి గీతంగా గుర్తింపు పొందిందీ గజల్. 'లాల్‌ఖిల' సినిమా 'బహదూర్ షా' జాఫర్ జీవితానికి సంబంధించినది. బహుదూర్‌షా జాఫర్ సాహిత్య పోషకుడు మాత్రమే కాదు స్వయంగా కవి కూడా. ముషాయిరాలలో అనేక గజళ్లు గానం చేశాడు.

'లగ్తా నహీ హై దిల్ మెర ఉజ్డే దయార్ మే'తో పాటూ 'న కిసీ కి ఆంఖ్ క నూర్ హూ' ప్రజల మనస్సులలో బహదూర్‌షా జఫర్ గజళ్లలా స్థిరపడింది. 'లాల్‌ఖిల' సినిమాలో ఈ గజళ్లు బహదూర్ షా జాఫర్‌పై చిత్రితమవటం, రఫీ స్వరం ఆ పాత్ర వేదనను ప్రస్ఫుటం చేయటంతో ఈ రెండు గజళ్లు బహదూర్ షా జాఫర్ గజళ్లలా స్థిరపడ్డాయి.

ముఖ్యంగా 'కిత్‌నా హై బద్‌నసీబ్ జఫర్ దఫ్న్‌కేలియే, దోగజ్ జమీన్ భీ నమిలీ కూ – ఎ – యార్ మే అనటం. 'మై వో బేకసీ క మజార్ హూ' అనటంతో ఢిల్లీనుంచి బర్మాకు బలవంతంగా బ్రిటీష్ వారు పంపి, 'రంగూన్'లో ఎవ్వరినీ కలవనీయకుండా ఉంచటంతో, అజ్ఞాతంలో మరణించిన బహదూర్ షాహ జాఫర్ మానసిక వేదనను ఈ పంక్తులు

ప్రతిబింబిస్తాయని పలువురు భావించారు. పైగా 'కిత్ నా హై బద్‌నసీబ్ జఫర్' అనటంతో ఇది బహదూర్‌షా జాఫర్ రచించిన ఘజల్  అన్న భావన స్థిరపడింది.

ముఖ్యంగా ఘజల్‌లోని నిరాశను, వేదనను గమనిస్తే, జీవితంలో ఎవరికీ ఏమీకాలేని, ఎవరికీ సహాయపడలేని, ఏదీ సాధించలేని నిస్సహాయుడైన వ్యక్తి వృధాగా చేజార్చుకున్న తన జీవితాన్ని వెనుతిరిగి చూస్తూ ప్రదర్శించే తీవ్రమైన బాధ బహదూర్ షాహ మానసిక స్థితిని సరిగ్గా ప్రదర్శిస్తుంది అనిపిస్తుంది.

'ఎవ్వరి కళ్లలో వెలుగు కాను. ఎవరి హృదయ శాంతినీ కాను. ఎవరికీ ఎందుకూ పనికిరాని ఒక పిడికెడు ధూళిని నేను' అన్నది పల్లవి సామాన్యార్ధం.

'నూర్' అంటే వెన్నెల, వెలుతురు అన్న అర్థాలు వస్తాయి. 'ఎవ్వరి కళ్ల వెలుతురు'కాను అంటే, ఆయనను చూసి ఎవరి కళ్లల్లో ఆనందం కనబడదనీ, ఎవ్వరికీ సహాయం చేయనివాడు, ఆనందం కలిగించని వాడు అన్న భావన వస్తుంది. అంటే, అతడిని చూసి ఎవ్వరి కళ్లు ఆనందంతో మెరవవౌ అన్నమాట. అతని వల్ల ఎవ్వరి కళ్లల్లో వెలుగు నిండదన్నమాట.

ఎవరి హృదయ శాంతిని కాను అనటం వల్ల ఆయనవల్ల ఎవ్వరికీ ఎలాంటి శాంతి సౌఖ్యాలు కలగలేదన్న భావన కలుగుతుతుంది. 'ముష్త్ – ఎ – గుబార్' అంటే పిడికిలిలోని ధూళి అన్న అర్థం వస్తుంది. కనీసం 'పిడికెడు ధూళి' అంత కూడా ఎవ్వరికీ పనికి రాలేదన్నమాట అతడు. ఎవ్వరికీ ఎలాంటి రీతిలోనూ పనికిరాని పిడికెడు ధూళి అతడు. బహదూర్ షాహ జఫర్ చివరి ముఘల్ సుల్తాన్.  1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర సంగ్రామానికి అతడిని బాధ్యుడిని చేసి బ్రిటీష్ వారు రంగూన్‌లో అతడిని బందీ చేశారు. ఆయన సుల్తాన్‌గా నిర్ణయాత్మకంగా వ్యవహరించలేదు. తనను నమ్మిన వారెవరికీ సహాయం చేయలేదు. చివరికి అధికారం కోసం అతని భార్యల ప్రేరణతో సంతానం నడుమ, బంధువుల నడుమ జరుగుతున్న పోరునూ ఆపలేదు. బ్రిటీష్ వారిని ఓడించి అతని ముందు తలవంచిన విప్లవ వీరులకు మార్గదర్శనమూ చేయలేదు. తన ప్రాణాలు,తన బేగమ్ ల ప్రాణాలు కాపడమని బ్రిటీష్ వారిని వేడుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. అలాంటివాడు ఒంటరిగా, అజ్ఞాతంలో, చావు కోసం ఎదురు చూస్తూ ఇలాంటి గజల్ రాయటంలో ఆశ్చర్యం లేదు.

న తో మై కిసీ క  హబీబ్ హూ

న తొ  మై కిసీ క  రఖీబ్ హు

జో బిగడ్ గయా వో నసీబ్ హూ

**జో ఉజడ్ గయా వో దయార్ హూ**

నేనెవరి స్నేహితుడనూ కాను. నాకెవరూ పోటీదార్లు (శత్రువులు) లేరు. నేను నాశనమైన అదృష్టాన్ని సర్వనాశనమైన భూమిని. నాశనమైన అదృష్టం అంటే, దురదృష్టానికి పరాకాష్ట అన్నమాట. ఒక దశలో హిందూ దేశానికి సుల్తాన్. మరో దశలో రంగూన్ లో అనామకుడు. ఒంటరి. అదృష్టం నష్టమవటం అంటే ఇది. రఫీ ఎంతో అద్భుతంగా, ప్రతిపదం భావాన్ని ఇనుమడింపచేస్తూ పాడతాడు ఈ పాటను.

'హబీబ్ హు' అన్నప్పుడు స్నేహితుడన్నవాడు లేని ఒంటరితనం మనసు అనుభవిస్తుంది. కనీసం శత్రువు అన్నవాడుకూడా లేని ఒంటరి భావనను మనసు గ్రహిస్తుంది. అదృష్ట విహీనత్వాన్ని, ఎడారి అయిన భూమిలాంటి జీవితాన్ని మనస్సు అర్ధం చేసుకుంటూంది. ఎడారి కూడా ఒకప్పుడు నది నీటితో పచ్చదనంతో కళకళ లాడినదే. ఎన్నిమార్లు విన్నా తనివి తీరదు. విషాదం ఒక స్థాయి తీవ్రతను దాటితే ఆనందంగా పరిణమిస్తుందంటారు. ఆ భావనను రఫీ స్వరం అనుభవానికి తెస్తుంది.

**మేర రంగ్ రూప్ బిగడ్ గయా.**

**మెర యార్ ముఝ్సె బిఛడ్ గయా**

**జో చమన్ ఖిజా మె ఉజడ్ గయా**

**మై ఉసీకి ఫస్ల్ – ఎ – బహార్ హూ**

నా శరీరపు రంగు పాలిపోయింది. రూపం పాడయిపోయింది. నా స్నేహితులు అంతా నాకు దూరమైపోయారు. ఆకులు రాలే కాలంలో నాశనమైపోయిన పూలతోట పంటను నేను. తీవ్రమైన నిరాశను ప్రతిబింబిస్తాయి. ఆకులు రాలే కాలంలో నాశనమైనది చిగురించే కాలంలో చిగురించదు. జీవం పోయింది. అలాంటి దుర్భరమైన జీవచ్ఛవంలాంటి స్థితిలో ఒంటరిగా మిగిలి ఉన్నాడన్నమాట.

**పాయె ఫాతిహా కోయి అయేక్యూ**

**కోయి చార్‌ఫూల్ చఢాయె క్యూ**

కోయి ఆకె షమ్మ జలాయె క్యూ

మై వో బేకసీ క మజూర్ హూ

'ఫాతిహా' అన్నది అరబ్బీ పదం. 'ఫాతాహా' అన్న పదం నుంచి వచ్చింది. 'ఫతాహా' అంటే తెరవటం, వివరించటం, గెలవటం అన్న అర్థాలు వస్తాయి. 'అల్ ఫతీహా' అంటే పవిత్ర ఖురాన్‌కు ముందు మాటలాంటిది. తప్పనిసరిగా చేయవలసిన ప్రార్థన ఇది. 'ఆరంభం ', 'నాందీ ప్రస్తావన' అన్నమాట.

'ఫతీహా దేనా' అన్న పదం ఉంది. మరణించిన వారికోసం ప్రార్థించటం అన్న అర్థం వస్తుంది. మరణించిన వారికోసం ఖురాన్‌లోని 'అల్ – ఫతీహా'ను మరణం తరువాత నలభై రోజులు చదువుతారు. అంటే ఖురాన్‌లోని ప్రథమ సూరాను మరణించిన వారికోసం చదువుతారు. 'పాయె ఫాతిహా కోయి ఆయె క్యూ?' అని అడుగుతున్నాడు కవి. అతడికి స్నేహితులు లేరు. శత్రువులు లేరు. నా అన్నవారు లేరు. ఎవరికీ ఏమీకాడు. అలాంటి వాడికోసం ఎవరు మాత్రం 'ఫాతిహా' చదువుతారు? 'ఫాతిహా' చదవటానికీ ఎవ్వరూ రానప్పుడు సమాధిపై పూలుంచేందుకు ఎవరు వస్తారు? పూలుంచేందుకు ఎవ్వరూ రానప్పుడు సమాధి దగ్గర దీపం ఎవ్వరు వెలిగిస్తారు? అంతటి దుర్భరమైన ఒంటరితనం అతనిది.

ఈ గజల్ వింటూంటే ఒక సుల్తాన్, అజ్ఞాతంలో, ఒంటరిగా, నా అన్నవాడు లేకుండా, బాధపడుతూండటం, అతడి నిరాశా నిస్పృహలు అనుభవానికి వస్తాయి. బహదూర్ షాహ జాఫర్ రాసిన ఈ గజల్, అతడి దుర్భరమైన నిరాశకు, ఒంటరి తనానికి అర్థం పడుతుందని భావించటంతో అతనిపై సానుభూతి పెరిగిపోతుంది. ముఖ్యంగా బర్మాలో ఒంటరిగా ఉంటూ ఇలాంటి గజల్లు రాశాడన్న భావన మరింత సానుభూతిని పెంచుతుంది.

కానీ న కిసీకి ఆంఖ్ కానీ, లగ్తా నహీ కానీ బహదూర్ షాహ జాఫర్ రాసిన గజల్లు కావన్న వాదన వినిపిస్తుంది. ఉర్దూ కవుల కవితా సంపుటాలను 'దివాన్'లంటారు. బహదూర్ షాహ మొదటి దివాన్ 1845లో ప్రచురితమైయింది. రెండవది 1849లో, మూడు, నాలుగు 1856లో ప్రచురితమయ్యాయి. నాలుగు దీవాన్లనూ కలిపిన కుల్లియత్ (కంప్లీట్ కలక్షన్) 1862, 1870లలో ప్రచురితమయింది.

ఈ ఏ సంపుటిలోకూడా ఈ రెండు గజల్లు లేవు. బహదూర్ షా గజల్ల సంపుటాలన్నీ ఆయన జీవిత కాలంలోనే ప్రచురితమయ్యాయి. కాబట్టి, ఈ రెండు గజల్లు ఆయన రాసినవి కాకపోవచ్చు. లేదా, ఆయన ఈ గజల్లను రంగూన్‌లో ఏకాంతంలో రాసి ఉండాలి. కానీ ఆయనకు రంగూన్‌లో పెన్నూ, కాగితాలు ఇవ్వలేదు బ్రిటీష్ వారు. ఎవ్వరినీ ఆయన

కలవలేదు. కాబట్టి ఆయన చెపితే ఎవరో గుర్తుపెట్టుకుని తరువాత రాసి ప్రచారంలోకి తెచ్చారనే వీలులేదు. కాబట్టి రంగూన్‌లో ఆయన గజళ్లు రాసి, వాటిని గుర్తుపెట్టుకున్నా ఆయన చెప్పేందుకు, చెపితే గుర్తుపెట్టుకునేందుకు మనిషిలేడు. కాబట్టి ఈ రెండు గజళ్లు బహదూర్‌షా రాసినవి కావని బలమైన వాదన ఉంది.

ఉర్దూ కవితా ప్రపంచంలో పేరు పొందిన కవుల పంథాలో కవితలు రచించే పద్ధతి ఉంది. ఆ కవిలానే కవితలు రచిస్తారు. కాబట్టి కవులు జఫర్ పంథాలో రచనలు చేసి వాటిని ఆయన పేరు మీద ప్రచారంలోకి తెచ్చారని వాదిస్తారు. ఎందుకంటే, 1958కి ముందు ఈ గజళ్లు ముషాయిరాల్లో వినిపించినా బహదూర్‌షా పేరు మీద ప్రచురితమయింది 1958లోనే.

1938లోనే ప్రముఖ కవి జాన్ నిసార్ అఖ్తర్ 'న కిసీకె ఆంఖ్' కవిత బహదూర్ షాది కాదు తన తండ్రి ముజ్తార్ ఖైరాబాద్ ది అని ప్రకటించాడు. అప్పటినుంచీ ఈ విషయంలో వాదోపవాదాలు సాగుతున్నాయి. 2015లో జావేద్ అఖ్తర్ తన తాత ముజ్తార్ ఖైరాబాదీ కవితలను అయిదు సంపుటాలుగా ప్రచురించాడు. వాటిలో 'న కిసీకి ఆంఖ్ క నూర్ హూ' కూడా ఉంది. దాంతో బహదూర్ షా జాఫర్ తన పేరుమీదున్న రెండు బహు ప్రచారం పొందిన కవితలను కూడా కోల్పోయాడు. కానీ ఉర్దూ సాహిత్య ప్రపంచంలో బహదూర్ షా జాఫర్ ఖ్యాతి ఏ మాత్రం తగ్గలేదు. అతని ఇతర కవితలను కూడా సినీ గేయ రచయితలు తమ గీతాలలో వాడుకున్నారు.

హిందీ సినిమా గేయరచయితలు, ప్రముఖ ఉర్దూ కవుల కవితలను అనుసరించటమేకాదు, వారి కవితలలో వాక్యాలతో తమ గేయాలను ఆరంభించారు.

**ఇబ్తదాయె ఇష్క్ హై రోతా హైక్యా**

**ఆగే ఆగే దేఖియే హోతా హై క్యా**

మీర్ తఖీ మీర్ రాసిన ఘజల్ ఇది. ప్రేమ ఆరంభమే ఇది. అప్పుడే ఏడిస్తే ఎలా? ఇంకా ముందుకువెళ్లి చూడు ఏమౌతుందో? అంటే ముందుంది మొసళ్ల పండుగ అన్నమాట. మీర్ తఖీమీర్ రాసిన ఈ ఘజల్‌ను ఆధారం చేసుకుని హస్రత్ జైపురి 'హరియాలీ ఔర్ రాస్తా' సినిమాలో రొమాంటిక్ యుగళగీతం రాశాడు.

**ఇబ్తెదాయె ఇష్క్ మే హం**

సారీ రాత్ జాగే,

అల్లజానే క్యాహోగా ఆగే,

ఓ మౌలా జానే క్యాహోగా ఆగే.

ప్రేమ ఇంకా ఆరంభంలో ఉండగానే రాత్రంతా మేల్కొని ఉన్నాను. ఇంకా ముందు ముందు ఏమౌతుందో ఆ దేవుడికే తెలుసు.

'అదాలత్' సినిమాలో రాజేందర్ క్రిషన్ అద్భుతమైన ఘజల్ రాశాడు.

ఉన్‌కో యె షికాయత్ హై కె హం కుఛే నహీ కహతే

ఆప్ నీ తౌ యే ఆదత్ హై కె  హం కుఛ్ నహీ కహతే..

మోమిన్ ఖాన్ మోమిన్ రాసిన గజల్ ఈ 'కుఛ్ నహి కహ్తే' కు ప్రేరణ.

డర్ తో ముఝే కిస్కా హై కె మై కుఛ్ నహి కహ్తే

పర్ హాల్ యే అఫ్షా   హై కె మై కుఛ్ నహి కహ్తే.

నేనెవరంటే అయినా  భయపడి మౌనంగా ఉన్నానా? నా రహస్యం అందరికీ తెలుసు కాబట్టి మౌనంగా ఉన్నాను.

'జహాన్ ఆరా' సినిమాలో రాజేందర్ క్రిషన్ అద్భుతమైన గజల్ రాశాడు.

మై తెరీ నజర్ క సురూర్ హూ తుఝె యాద్ హో కె న యాద్ హో

తెరె పాస్ రహకె భీ దూర్ హూ తుఝె యాద్ హో కె న యాద్ హో.

ఈ ఘజల్‌కు ప్రేరణ కూడా మోమిన్ ఖాన్ మోమిన్ ఘజల్‌లో ఉంది.

వో జో హం మె తుం మె ఖరార్ థా

**తుఝె యాద్ హో కె న యాద్ హో**

ఈ ఘజల్‌లోని 'తుఝె యాద్ హోకె నయాద్ హో'ను వాడుకుని సుందరమైన ఘజల్ రచించాడు రాజేందర్ క్రిషన్

**'రఘుపతి సాహాయ్ ఫిరాఖ్' ఒక ఘజల్ రాశాడు.**

**హుస్న్ భి ఉదాస్ ఉదాస్, షాం భి థి ధువాన్ ధువాన్**

**యాద్ సి ఆకె రహగయి దిల్ కా కోయీ కహానియాన్...**

ఇదే పంథాలో 'నికాహ్ ' సినిమాలో 'హసన్ కమాల్' సూపర్ హిట్ పాటను సృజించాడు.

**సమా భి హై జవాన్ జవాన్**

**హవాభి హై రవాన్ రవాన్**

**సూనా రహాహై యే సమా**

**సూనీ సూనీ సి దాస్తాన్....**

రఘుపతి సహాయ్ ఫిరాఖ్ రాసిన మరో ఘజల్‌ను మజ్రూహ్ సుల్తాన్ పురి అతి సుందరమైన సినీగీతంగా మలచాడు. మహమ్మద్ రఫీ స్వరంలో పాట సూపర్ హిట్‌గా నిలిచింది.

**చిరాగ్ దిల్‌కా జలావో బహుత్ అంధేరాహై**

**కహీ సె లౌట్ కె ఆవో, బహుత్ అంధేరా హై**

ఇది సినిమా పాట. మదన్ మోహన్ ఆకర్షణీయమైన బాణీని కూర్చాడు. ఈ పాట రచనకు ప్రేరణ రఘుపతి సహాయ్ ఫిరాఖ్ గజల్.

**షకుత్ – ఎ – షాం మిటావో బహుత్ అంధేరా హై**

**షరిఖాన్ కి షమా జలావో బహుత్ అంధేరా హై**

'బడా ఆద్మీ' సినిమాలో 'ప్రేమ్ ధవన్' చక్కటి గజల్‌లాంటి గీతం రచించాడు ఈ ఘజల్ ప్రేరణతో. చిత్రగుప్త సంగీత దర్శకత్వంలో మహమ్మద్ రఫీ అద్భుతంగా పాడాడు ఈ పాటను.

**అగర్ దిల్ కిసీసె లగాయా నహోతా**

**జమానే నె హంకో మిటాయా న హోతా...**

**ఈ ఘజల్ కు ప్రేరణ బహదూర్ షాహ జాఫర్ ఘజల్.**

**యా ముఝె అఫ్సర్ – ఎ – షాహానా బనాయాహోతా**

**యా మెరా తాజ్ గడాయాన బనాయా హోతా**

ఇలా, హిందీ సినీగేయ రచయితలు ఉర్దూ సాహిత్య ప్రభావంతో సుందరమైన గీతాలు రచించారు. హిందీ సినీ గేయ ప్రపంచాన్ని ఉన్నత భావాల మయం చేయటమే కాదు సినీ గీతానికి సాహిత్య గంధం పూశారు. సమాజంలో తమ గీతాల ద్వారా ఉత్తమ ఆలోచనలను విస్తరింప చేయటమే కాదు ఉత్తమ సాహిత్యాన్ని పరిచయం చేశారు. ఎలాగయితే, సంగీతం, రాగం తెలియకున్నా సామాన్యుడు సైతం సినీ గీతాలను వింటూ పాడుతూ మైమరచిపోవటం ద్వారా సంగీతం కలిగించే సంస్కారాన్ని గ్రహిస్తూ అలౌకికానందం పొందగలుగుతున్నాడో, అలాగే, తెలియకుండానే, సినీకవులు తమ గేయాల్లో పొందుపరచిన సుందరమైన ఉత్తమ సాహిత్యాన్ని అనుభవిస్తూ సంస్కారాన్ని పొందటమేకాదు సాహిత్య గంధాన్ని కూడా ఆస్వాదిస్తున్నాడన్నమాట సామాన్యుడు.

అందుకే సినీకవుల పని పదాలను కూర్చటం కాదు, ప్రాచీన సాహిత్య పరిజ్ఞానం కలిగి, ఉత్తమ సాహిత్య సృజన ఆధారంగా చక్కని గీతాలను సృజించి సమాజానికి అందించటం. అందువల్ల సినిమా స్థాయి పెరగటమేకాదు సమాజంలో వ్యక్తి ఆలోచన, స్పందనల స్థాయి కూడా పెరుగుతుంది.

సాహిత్యం వ్యక్తిలో నిద్రాణమై ఉన్న సున్నిత భావనలను జాగృతం చేస్తుంది. వ్యక్తి ఊహలకు రెక్కలనిస్తుంది. వ్యక్తిలోని సృజనాత్మకతను చైతన్యవంతం చేస్తుంది. తద్వారా సున్నితమైన మనస్కులవుతారు మనుషులు. ఎప్పుడయితే సమాజం సాహిత్యానికి స్పందించే లక్షణం కోల్పోతుందో అప్పుడా సమాజం సున్నిత భావనలు లేని మర మనుషుల

సమాజంలా మారుతుంది. అందుకే సినీ కవులకు ప్రాచీన సాహిత్యంతో సన్నిహిత సంబంధం ఉండాలి. పరిజ్ఞానం ఉండాలి.

ఈ వ్యాసంతో హిందీ సినీ సాహిత్యంపై ఉర్దూ కవుల ప్రభావం గూర్చిన చర్చకు, విహంగ వీక్షణ వ్యాసాలకు తాత్కాలిక విరామం పలికి, నూతన సంవత్సరంలో హిందీ సినీ సాహిత్యంపై హిందీ సంప్రదాయ కవిత్వ ప్రభావం గురించి నూతన సంవత్సరంలో చర్చించటం ఆరంభిద్దాం.

Click here to share your comments